సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 16 । మార్చి । 2024



రూ.12 కోట్లతో రైల్వే అండర్ బ్రిడ్జి

రైల్వేకోడూరు నియోజకవర్గంలో రైల్వే అండర్ బ్రిడ్జి డబుల్ వే పనులను సీఎం వైఎస్ జగన్, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో ప్రారంభించామని ప్రభుత్వ విప్ కొరముట్ల చెప్పారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సహర్ ఆది (ఉ॥)
రాయచోటి	6.30	5.06
రాజంపేట	6.30	5.04
పీలేరు	6.32	5.01
మదనపల్లె	6.31	5.08

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 40 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	475	475
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 151.220 కిలోలు

న్యూస్‌రీల్

రూ.7.41 కోట్లతో వైఎస్సార్ ఘాట్ పునరుద్ధరణ

వేంపల్లె: ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ పునరుద్ధరణకుచర్యలు తీసుకుంటున్నట్లు ఆర్ అండ్‌బీ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఘాట్ వద్ద రూ.7.41కోట్లతో చేపట్టిన పునరుద్ధరణ పనులకు శుక్రవారం డీఈ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచామని, కేసీపీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు దక్కించుకుందని తెలిపారు.

ఫేస్-4 జాతీయ పులుల గణన



సిద్దవటం రేంజ్‌లో కెమెరాలను ఏర్పాటు చేస్తున్న అటవీ సిబ్బంది

సిద్దవటం: జిల్లాలో ఫేస్-4 జాతీయ పులుల గణన కార్యక్రమాన్ని నిర్వహించామని సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ కడపడీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు మద్దూరు, కొండూరు, గొల్లపల్లి, ముత్తుకూరు, పాన్నాపల్లి, రోళ్లబోడు బీట్లలోని అటవీ ప్రాంతాల్లో పులుల ఆచూకీ కోసం మొత్తం 28 ప్రదేశాలను గుర్తించామన్నారు. ఒక్కొక్క చోట రెండు కెమెరాలను ఏర్పాటు చేశామని, 40 రోజుల పాటు ఈ గణన జరుగుతుందని రేంజర్ కళావతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, ఎఫ్ఎస్ఓ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్నివీర్ల' నియామకానికి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

రాయచోటి: భారత సైన్యంలోని వివిధ కేటగిరీలలో 'అగ్నివీర్ల' నియామకానికి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ అధికారి కర్నల్ పునీత్‌కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ నుంచి పత్రికలకు ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనను జారీ చేశారు. 2024-25లో అగ్నివీర్ల నియామకాల కోసం ఈ నెల 13వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ల నమోదుకు ఈ నెల 22వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ తదితర పోస్టులకుదరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం



మందులను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య

గాలివీడు: రక్తహీనత పరీక్షలు డిజిటల్ మీటర్ పద్ధతిలో కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని డీఎంహెచ్ఓ కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గరుగుపల్లె(పందికుంట) సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల అమలు తీరుపై డాక్టర్ ప్రవంతిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. దాదాపు 250 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న రఘురాం


రాయచోటి: వినియోగదారులు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్ఓ రఘురాం పేర్కొన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఎస్ఓ కార్యాలయంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రఘురాం ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దైనందిన జీవితంలో ఉపయోగించే ప్రతి వస్తువుపై చట్టపరమైన హక్కును ప్రభుత్వం కల్పించిందని, వినియోగదారులు తమ హక్కుల పట్ల ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని డీఎస్ఓ సూచించారు. ఈ విషయంలో ప్రజలను చైతన్య పరచడంలో విద్యార్థులు, మీడియా ప్రముఖ పాత్ర పోషించాలన్నారు.

కృష్ణాభిషేకం



ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చెరువులు కృష్ణమ్మ స్పర్శతో పరవశించిపోయాయి. ఇక్కడి నేలతల్లిని 3 సార్లు కృష్ణాజలాలు అభిషేకించడంతో పులకరించిపోయింది. దీంతో భూగర్భజలం పెరిగింది. వ్యవసాయబోర్లలో నీటిమట్టం పెరిగింది. సాగునీటి కష్టాలు తీరుతున్నాయి.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 3 సార్లు కృష్ణా జలాలు రాక
- టీడీపీ పాలనలో మొక్కుబడి తరలింపు



కృష్ణా నీటితో కళకళలాడుతున్న కుప్పంలోని మద్దికుంట చెరువు (ఇన్‌సెట్) కాలువలో నీటి ప్రవాహంతో గుంతావారిపల్లెలో పాడుబడిన బావిలో నిండుగా నీళ్లు

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాల తరలింపు వ్యవహారంలో చిత్తశుద్ధిని ప్రదర్శించింది. ఈ విషయంలో టీడీపీ ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తూతూమంత్రంగా నీటిని పారించి చేతులు దులుపుకుంది. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు కుప్పానికి కృష్ణా జలాలు తరలించలేక పోగా ఇప్పుడు నీళ్లపైనా విమర్శలు చేస్తున్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా సీఎం జగన్ పాలనలో ఉమ్మడి చిత్తూరుజిల్లాకు మూడుసార్లు 6.4618 టీఎంసీల కృష్ణాజలాలు చేరాయి. శ్రీశైలం నుంచి అనంతపురంజిల్లాలోని జీడిపల్లె రిజర్వాయర్‌కు అక్కడి నుంచి సత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె జలాశయానికి చేరిన కృష్ణా జలాలను ఇక్కడి పుంగనూరు ఉపకాలువ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తరలించారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో మొదటిసారి 2019 నవంబర్ 22 నుంచి మార్చి వరకు 1.34 టీఎంసీలు, 2020 నవంబర్ 12 నుంచి 2021 మే15 వరకు 2.5218 టీఎంసీలను ప్రస్తుత అన్నమయ్య, చిత్తూరుజిల్లాలకు చెందిన 91 చెరువులకు అందించారు. కుప్పం ఉపకాలువ సాగే వి.కోట మండలం వరకు తరలించారు. మదనపల్లె, పుంగనూరు పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే చిప్పిలి, గుంటివారిపల్లె, పుంగమ్మ సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులను కృష్ణా జలాలతో నింపారు. పలమనేరు నియోజకవర్గం శంకర్రాయలపేట చెరువుకు నీటిని తరలించారు. తాజాగా గత ఏడాది అక్టోబర్ 9 నుంచి ప్రస్తుత మార్చి 5 వరకు 2.6 టీఎంసీల కృష్ణా జలాలు పారాయి. ఈ జలాలను నేరుగా మాజీ సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పంకు తరలించగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జలాలను కుప్పం ప్రజలకు అంకితం చేశారు.

పెరిగిన భూగర్భ జలాలు

హంద్రీనీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ ద్వారా అన్నమయ్యజిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, చిత్తూరుజిల్లాలోని పుంగనూరు, పలమనేరు, కుప్పం కాలువ పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో సాగుతోంది. ఈ కాలువ నిండా కృష్ణా జలాలు ప్రవహించడంతో ఈ మార్గంలోని పల్లెల్లోని వ్యవసాయ బోర్ల లో నీటిమట్టం పెరిగింది. పాడుబడిన బావులు, నిరుపయోగమైన సేద్యం బావులు నీటితో నిండిపోయాయి. దీంతో వ్యవసాయానికి సాగునీటి కష్టాలు తీరుతున్నాయి.

టీడీపీ హయాంలో అంతా ఆర్భాటమే..

2019 ఎన్నికల్లో ప్రయోజనం పొందడం కోసం టీడీపీ ప్రభుత్వం 2019 జనవరి 21న జిల్లాలోకి హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ ద్వారా కృష్ణా జలాలను తరలించారు. 2019 జనవరి 21న ప్రారంభించి ఏప్రిల్ 11 వరకు తరలించి ఆర్భాటం చేసినా అందించిన నీళ్లు కేవలం 775 ఎంసీఎఫ్టీలు. కాలువలో నీళ్లు పారించారే కానీ ఒక్క చెరువుకు నీళ్లివ్వలేదు. తరలించిన జలాలు కాలువలో ప్రవాహానికే సరిపోయింది.

కుప్పంలో మూడు చెరువులకు..

పుంగనూరు ఉపకాలువ నుంచి కుప్పం ఉపకాలువ ద్వారా కుప్పం నియోజకవర్గంలోని మూడు చెరువులను కృష్ణా జలాలతో నింపారు. రామకుప్పం మండలంలోని మద్దికుంట, వెరశిచెరువు, శాంతిపురం మండలంలోని చిట్టివానికుంటలను కృష్ణా జలాలతో నింపారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో మరో ఏడు చెరువులకు కృష్ణా జలాలు ప్రవహించగా నిండాయి. బి.కొత్తకోట వద్ద కాలువకు గండిపడటంతో నీళ్లన్ని పెద్దతిప్పసముద్రం మండలంలోని రంగరాయ చెరువుకు చేరగా ఇప్పటికీ పుష్కలంగా నీళ్లున్నాయి. 2021లో కృష్ణా జలాలతో తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరులోని 91 చెరువులు, సమ్మర్ స్టోరేజి ట్యాంకులకు నీటిని తరలించారు.

- శ్రీశైలం నుంచి జీడిపల్లె రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తే అక్కడినుంచి చెర్లోపల్లె రిజర్వాయర్‌కు చేరితే ఇక్కడి నుంచి ఉమ్మడి చిత్తూరుజిల్లాకు పుంగనూరు ఉపకాలువ ద్వారా నీటి తరలిస్తారు. ప్రస్తుత ప్రభుత్వంలో మూడోసారి నీటిని అత్యధిక పరిమాణంలో తరలించినా నీటి ఆవిరి ఫలితంగా ఇబ్బందికరంగా మారింది. చెర్లోపల్లె నుంచి 150 నుంచి 200 క్యూసెక్కులు విడుదల చేసినా కుప్పం నియోజకవర్గానికి 10 క్యూసెక్కులు కూడా చేరలేదు. 400 కిలోమీటర్లు కృష్ణా జలాలు ప్రవహించి చేరుకు నేలోగా ఎండలకు ఆవిరవ్వడం వల్ల ప్రవాహం ముందుకు సాగలేదు. దీంతో ఎక్కువ రోజులు, ఎక్కువ సామర్థ్యంలో నీటిని తరలించాల్సి వచ్చింది. చెర్లోపల్లె రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 1.618 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.4 టీఎంసీలకు తగ్గిపోయింది.

శ్రీశైలంలో తగ్గిన నీటిమట్టం



శ్రీశైలం ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గడంతో పుంగనూరు ఉపకాలువకు నీటి తరలింపు తాత్కాలికంగా బ్రేక్ పడింది. శ్రీశైలం నుంచి జీడిపల్లె రిజర్వాయర్‌కు 424 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయి. నీటి ప్రవాహ సామర్థ్యం 800 క్యూసెక్కులు పెరిగితేకాని సాధ్యం కాదు. శ్రీశైలంలో నీటి మట్టం పెరగగానే ఇక్కడికి కృష్ణా జలాల తరలింపునకు వీలవుతుంది. -రాజగోపాల్, హంద్రీనీవా ఎస్ఈ, మదనపల్లె

నేడు ఇడుపులపాయకు సీఎం వైఎస్ జగన్



కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఇడుపులపాయకు రానున్నారు. అధికారికంగా ఆయన పర్యటన ఖరారైంది. వివరాలు ఇలా ఉన్నాయి.

- ఉదయం 10.45 గంటలకు తన అధికార నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11.05 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 11.15 గంటలకు అక్కడి నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 12.05 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 12.15 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.30 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12.35 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 12.40 గంటలకు వైఎస్సార్ ఘాట్ వద్దకు చేరుకుంటారు.
- 12.55 గంటల వరకు అక్కడ నిర్వహించే ప్రార్థనల్లో పాల్గొంటారు.
- 12.58 గంటల నుంచి 1.20 గంటల వరకు ఇడుపులపాయలో నిర్వహించే కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు.
- 1.20 గంటలకు వైఎస్సార్ ఘాట్ నుంచి బయలుదేరి 1.25 గంటలకు అక్కడి గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు.
- 1.40 గంటల వరకు రిజర్వు
- 1.40 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరి 1.45 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 1.50 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.05 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 2.15 గంటలకు విమానంలో బయలుదేరి 3.05 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 3.10 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 3.30 గంటలకు తన నివాసానికి చేరుకుంటారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి: ఎన్నికలనియమావళిని ప్రతి అధికారి పాటించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా పాటించాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేడేడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కంట్రోల్ రూంకు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి రిపోర్ట్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి తెలియజేయాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై స్పందించి 100 నిమిషాల వ్యవధిలో వాటికి సంబంధించిన నివేదికను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే అధికారులు అందరూ ఎన్నికల కమిషన్ పరిధిలో పని చేయాల్సి ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యా లయాలలో రాజకీయ నాయకుల ఫొటోలు, వాల్ పోస్టర్లు, కరపత్రాలను వెంటనే తొలిగించాలని సూచించారు. జాతీయ నాయకుల విగ్రహాల మినహా మిగిలిన విగ్రహాలకు ముసుగులు తొడగాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల్లో ఏమి చేయాలో..ఏమి చేయకూడదు అనే అంశాలపై స్పష్టత కలిగి ఉండాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.

- ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ వివిధ రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు.

వైఎస్ వివేకా హత్యకేసులో నిజం గెలవాలి: షర్మిల



వైఎస్ వివేకా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షర్మిల

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిజం గెలవాలని కోరుకుంటున్నామని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తెలిపారు. వైఎస్సార్‌జిల్లా కేంద్రమైన కడప శివార్లలోని జయరాజ గార్డెన్‌లో వైఎస్ వివేకా వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన షర్మిల మాట్లాడుతూ వైఎస్ వివేకా హత్యకేసులో సునీత చేస్తున్న న్యాయ, ధర్మ పోరాటానికి తాను అండగా ఉంటానని తెలిపారు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత మాట్లాడుతూ వైఎస్ వివేకాకు కమ్యూనిస్టు సిద్ధాంతాలంటే ఇష్టమన్నారు. నేరస్తులకు శిక్షపడేలా పోరాడుతున్న నాపై నిందమోపడం సమంజసమా అని అన్నారు. హత్యతో సంబంధం ఉంటే మాకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేవీపీ రామచంద్రరావు, తులసిరెడ్డి, బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డి, వరదరాజులరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సి.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాటకంలో పావులుగా మారవద్దు

- ఒకే కుటుంబాన్ని టార్గెట్ చేయడం భావ్యం కాదు
- షర్మిల, సునీతలకు వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ సురేష్‌బాబు సూచన



మాట్లాడుతున్న సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ, ఇతర పార్టీలు ఆడుతున్న కపట నాటకంలో పావులుగా మారవద్దని వైఎస్సార్‌సీపీ కడప, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల రీజినల్ కోఆర్డినేటర్ కె.సురేష్‌బాబు షర్మిల, సునీతలకు హితవు పలికారు. కడపలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తున్నాయనే వైఎస్.వివేకానందరెడ్డి వర్ధంతి సభ నిర్వహించి సొంత అన్నపై దారుణమైన విమర్శలు చేయడం షర్మిల, సునీతలకు తగదన్నారు. ఐదేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వంలో వైఎస్‌వివేకానందరెడ్డి హత్య జరిగిందని, ఆ రోజు మొట్టమొదటగా సీబీఐ విచారణ కోరింది వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డేనని గుర్తు చేశారు. సీబీఐ అధికారులు హత్య చేసిన వ్యక్తిని అప్రూవర్‌గా మార్చి ఒక కుటుంబాన్ని కేసులో ఇరికించేందుకు కుట్ర చేయడం దారుణమన్నారు. ఒకే కోణంలో కాకుండా, మరో కోణంలో కూడా విచారించాలని తాము మొదటినుంచి కోరుతున్నామన్నారు. వివేకానందరెడ్డి అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి, మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవిలను విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. టీడీపీ, జనసేన, కాంగ్రెస్ మాయలో పడి సొంత అన్నను అప్రతిష్ఠపాలు చేయాలని షర్మిల, సునీతలు కంకణం కట్టుకోవడం దారుణమన్నారు. వివేకా పీఏ కృష్ణారెడ్డికి సునీత ఫోన్ చేసి లేఖ ఎవరికీ ఇవ్వవద్దని చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎంపీగా వైఎస్.అవినాష్ రెడ్డిని గెలిపించేందుకు వివేకానందరెడ్డి చివరి వరకు పనిచేశారన్నారు. అలాగే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కాంగ్రెస్‌పార్టీ అక్రమ కేసు బనాయించి జైలుకు పంపినపుడు పార్టీకి ఎంతో అండగా ఉన్నారన్నారు. టీడీపీ కుట్రలో భాగంగా వైఎస్.అవినాష్ రెడ్డిని కేసులో ఇరికించడాన్ని మాత్రమే తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పుడు అండగా నిలిచి మాయమాటలు చెబుతున్నవారే రేపు కీచకులుగా మారే ప్రమాదముందని షర్మిల, సునీతలు గుర్తించాలన్నారు. వారికి మద్దతు ఇస్తున్న పార్టీలన్నీ వైఎస్ కుటుంబాన్ని అణగదొక్కాలని చూశాయే తప్ప ఏనాడు మేలు చేయాలని ఆలోచించలేదన్న సత్యాన్ని వారు గుర్తించాలన్నారు. వారి మాయలో పడవద్దని ఆయన సూచించారు.

'దొమ్మలపాటి'కి టికెట్ రాలేదని అనుచరుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె: ఎమ్మెల్యే అభ్యర్థిగా తన అభిమాన నాయకుడు, మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్‌కు పార్టీ అధినేత చంద్రబాబు టికెట్ నిరాకరించడంపై పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు, రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్ మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. శుక్రవారం రాత్రి పట్టణంలోని నీరు గట్టువారిపల్లిలో ఈ సంఘటన జరిగింది. గమనించిన కుటుంబ సభ్యులు గది తలుపులు పగలగొట్టి వేల్పుల వెంకటేష్‌ను ప్రాణాపాయం నుంచి రక్షించారు. మదనపల్లె టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషాను టీడీపీ ప్రకటించిన విషయం తెలిసిందే. దొమ్మలపాటి రమేష్, ఆయన కుమారుడు యశ్వంత్.. వెంకటేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఒంటిమిట్టలో ఏప్రిల్ 16 నుంచి బ్రహ్మోత్సవాలు



కల్యాణ వేదిక వద్ద పనులను పరిశీలిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం, తదితరులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 16వ తేదీ నుంచి నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్ష జరిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 16వ తేదీన సాయంత్రం అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.22వ తేదీన శ్రీ కోదండరాముడి కల్యాణం జరగుతుందన్నారు. నెల రోజుల ముందు నుంచే టీటీడీ పనులను ప్రారంభించిందని వీరబ్రహ్మం తెలిపారు. కల్యాణోత్సవాని హాజరయ్యే భక్తులకు తాగునీరు, అన్నప్రసాదల పంపిణీ, ఏర్పాట్లపై సమీక్ష జరిపామన్నారు. గ్యాలరీల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కల్యాణవేదిక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను ఆకట్టుకునేలా నిర్వహిస్తామన్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ముత్యాల తలంబ్రాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణ్‌రెడ్డి, డిప్యూటీ ఈఓలు నటేష్ బాబు, ప్రశాంతి, ఆదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

రాజంపేట/రాయచోటి టౌన్ : జిల్లా వాణిజ్య విభాగం కమిటీ నియామకం జరిగింది. ఈమేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అధ్యక్షుడిగా సనిశెట్టి నవీన్‌కుమార్(రాజంపేట), ఉపాధ్యక్షులుగా చిన్న కంభం సురేంద్రనాథరెడ్డి (పీలేరు), పెండ్యాల విజయ్‌కుమార్ (రైల్వేకోడూరు), ప్రధానకార్యదర్శులుగా కాలువ మురళీధర్(రైల్వేకోడూరు), ఏల్చూరు అశోక్(రాజంపేట), దాసరథి మధుసూదనరెడి (రాయచోటి), వడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (పీలేరు), కార్యదర్శులుగా వచెర్ల సత్యనారాయణ(రైల్వేకోడూరు). జోన్నలగడ్డ సతీష్(రైల్వేకోడూరు), మురళీ (రాజంపేట), ఎస్‌కే హైదర్‌బాషా(రాజంపేట), ఎస్.సుబ్రమణ్యం(పీలేరు), అలీఖాన్(పీలేరు), టంగల గంగాధర్(రాయచోటి), వడ్డి వెంకటసుబ్బారెడ్డి(రాయచోటి), అంబటి రాజేష్‌కుమార్((తంబళ్లపల్లె), జాయింట్‌సెక్రటరీలుగా కోట సత్యనారాయణ (రైల్వేకోడూరు), పిన బాలు శేఖర్(రైల్వేకోడూరు), ఏలకంటి అవినాష్(రాజంపేట), సయ్యద్ నజీర(రాజంపేట), కొల్లకుల్లారెడ్డి(రాయచోటి), ఆరం దేవేంద్రకుమార్ (రాయచోటి), ఎం.రాఘవేంద్ర(తంబళ్లపల్లె), నంగిమునిరామయ్య (పీలేరు), సుంకరశివ(పీలేరు) నియమితులయ్యారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- మార్చి 18 నుంచి 30 వరకు పరీక్షలు
- విద్యార్థుల ఉత్తీర్ణతకు ప్రణాళిక
- 129 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి 30 వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై డీఈఓ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య, రవాణా తదితర శాఖల అధికారుల సమన్వయంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద చిన్నపాటి సంఘటన తలెత్తకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. హాల్ టికెట్ ఆధారంగా ఆర్టీసీ బస్సులలో విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామన్నారు. పరీక్షలు రాసిన తర్వాత వెళ్లేటప్పుడు కూడా ఉచిత ప్రయాణం ఉండేలా జిల్లా కలెక్టర్ ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. జిల్లాలో 129 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని డీఈఓ తెలిపారు.శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులూ శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా పది పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 492 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 25522 మంది విద్యార్థులు పది పరీక్షలు రాసేందుకు సన్నద్ధమయ్యారని చెప్పారు. వారిలో 22466 మంది రెగ్యులర్, 3056 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. 11254 మంది బాలురు, 11212 మంది బాలికలు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. వారి కోసం 129 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఇందులో ఏ-కేటగిరీ కేంద్రాలు 58, బీ-కేటగిరీ 55, సి-కేటగిరీ 16 ఉన్నాయన్నారు.విద్యార్థులు ప్రశాంతంగా ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు. జిల్లా పరీక్షల అబ్జర్వర్‌గా సర్వశిక్షా అభియాన్ అధికారి మస్తానయ్య నియమితులయ్యారన్నారు. 129 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ల నియామకం పూర్తి చేశామని, అలాగే డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించామన్నారు. అదనపు డిపార్ట్‌మెంట్ అధికారులు, ఆరుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షణ ఉంటుందన్నారు. మరో 66 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లుగా వ్యవహరిస్తారని చెప్పారు. పరీక్షల నిర్వహణకు 1200 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. అవసరమైతే మేజర్‌మండల కేంద్రాల పరిధిలో 10 నుంచి 20 మంది ఇన్విజిలేటర్లను సిద్ధంగా పెట్టుకోవాలని మండల విద్యా శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. పరీక్ష పత్రాలను భద్రపరచడానికి 31 స్ట్రాంగ్ రూమ్‌లను సిద్ధం చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం వంటి తప్పనిసరిగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థులు ఉదయం 8:50 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఈఓ సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు ఇతర ఎలక్ట్రికల్ వస్తువులను అనుమతించమని శివప్రకాష్‌రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో డీఈఓ కార్యాలయం ఏడీ ప్రసాద్ బాబు కూడా పాల్గొన్నారు.

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

కలికిరి : కలికిరి సమీపంలో జరుగుతున్న హైవే రోడ్డు పనుల వద్ద ఇనుప కమ్మీలు చోరీకి సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు సీఐ ఆర్.మోహన్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ టౌన్‌కు చెందిన పి.రెడ్డెప్ప, కలికిరి ఇందిరమ్మకాలనీకి చెందిన ఎం.వెంకటేష్ హైవే వద్ద పనులకు నిల్వ చేసిన కమ్మీల చోరీకి పాల్పడ్డారు. హైవే సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులు కలికిరి సైనిక పాఠశాల గ్రౌండ్ వెనుక ప్రాంతంలో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పది వేలు రూపాయలు విలువ చేసే ఇనుపకమ్మీలను స్వాధీనం చేసుకున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


రాజశేఖర్ మృతదేహం

పీలేరు రూరల్ : ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవవడ్డిపల్లెలో చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మొరవవడ్డిపల్లెకు చెందిన ఎం.రాజశేఖర్ (34) కొంత కాలంగా తాగుడుకు బానిస అయి తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య గౌతమితోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. దేవళం వీధిలో నివాసం ఉంటున్న రాజేంద్ర(35) ఆర్టీసీ బస్టాండ్ వద్ద దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. అయితే వ్యాపార కుటుంబ అవసరాల నిమిత్తం పలువురు వద్ద అప్పులు చేశాడు. రుణభారం పెరిగి ఒత్తిళ్లు అధికం కావడంతో, శుక్రవారం ఇంటి వద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రూ.12 కోట్లతో రైల్వే అండర్ బ్రిడ్జి

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


రైల్వే అండర్ బ్రిడ్జి పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలో ప్రజా సమస్యలే పరిష్కారంగా అతి ముఖ్యమైన రైల్వే అండర్ బ్రిడ్జి డబుల్ వే పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో ప్రారంభించామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు ఆయన పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో దశాబ్దాలుగా 26 గ్రామాలకు ఉన్న సమస్యను నేడు పరిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు, రైతుల సమస్యలకు ఎంతో పరిష్కారం చూపుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి అడిగిన వెంటనే ప్రతి ఒక్కటీ చేస్తున్నారని తెలిపారు. ఎన్నో దశాబ్దాలుగా రైల్వేకోడూరులో పరిష్కారం కాని సమస్యలన్నింటినీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పరిష్కరిస్తోందని తెలిపారు. ముఖ్యంగా పట్టణ సుందరీకరణ, గ్రామీణ ప్రాంతాలలో రహదారి, బ్రిడ్జిలు, తాగునీటి సమస్యలకు ఓవర్ హెడ్ ట్యాంకులు, రోడ్లు, ఇలా ఎన్నో పనులు కోట్లు ఖర్చు పెట్టి పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈ పనులపై గత టీడీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు నిర్లక్ష్యం వహించినప్పటికీ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ మిథున్‌రెడ్డికి, తనకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఆయన కోరారు.

రాజన్న క్యాంటీన్ పరిశీలన

రైల్వేకోడూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించిన రాజన్న క్యాంటీన్‌ను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుపేదకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు.

కృతజ్ఞతలు తెలిపిన ఎస్సీ నాయకులు

అన్నమయ్య జిల్లా ఎస్సీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఇసుకపాటి నారాయణమ్మ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తదితర నాయకులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా స్థాయిలో ఎస్సీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంటుగా పదవి ఇచ్చినందుకు పార్టీ ప్రతిష్టకు, ఎస్సీల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాలలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ, రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్ రాజు, అహ్మదుల్లా, సర్పంచ్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ తోట శివసాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో బురిడీ

- ఆర్ఎంపీని మోసగించిన జంట
- రూ.7.10 లక్షలు దోచుకున్న వైనం

మదనపల్లె : మోసాలు అనేక రకాలు.. ఎన్నో విధాలుగా ఎన్నో సార్లు ప్రజలు మోసగాళ్ల బారిన పడుతున్నా, ఇంకా కొంత మంది మారడం లేదు. తక్కువ ధరకు బంగారం విక్రయిస్తామంటే వెనకా, ముందు ఆలోచించకుండా మోసగాళ్ల బారిన పడుతున్నారు. ఈ కోవలో ఓ ఆర్ఎంపీ డాక్టర్ రూ.7.10 లక్షలు పోగొట్టుకుని, పోలీసులను ఆశ్రయించిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. బాపట్ల జిల్లా కరియపాలెం మండలం పెదపులుగువారిపాలెంకు చెందిన హుద్దూస్ కుమారుడు షేక్ గౌస్(35), స్థానికంగా ఆర్ఎంపీ డాక్టర్‌గా సేవలందిస్తూ జీవిస్తున్నాడు. మూడు నెలల క్రితం ఆయన నిర్వహిస్తున్న గౌస్ క్లినిక్ వద్దకు ఒక రోజు 45–50 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని జంట వచ్చారు. తాము అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి వ్యాపారం నిమిత్తం వచ్చామని, వ్యాపారం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వారిద్దరిలో... మగ వ్యక్తి కడుపు నొప్పితో బాధపడుతున్నాడని చికిత్సలు చేయాల్సిందిగా కోరారు. డాక్టర్ వైద్య చికిత్సలందించి మందులు ఇచ్చాడు. తమ వద్ద డబ్బులు లేవని, సొంత ఊరికి వెళ్లాక ఫోన్ పే చేస్తామని చెప్పారు. కొన్నాళ్ల తర్వాత ఆ జంట డాక్టర్‌కు ఫోన్ చేసి, మీరు మాకు ఎంతో సాయం చేశారని, తమ పొలంలో జేసీబీతో పని చేస్తుండగా, బంగారు నగలు దొరికాయని, తక్కువ ధరకు విక్రయించాలని అనుకుంటున్నట్లు నిందితులు డాక్టర్‌కు చెప్పారు. మీరు నేరుగా వచ్చి పరీక్షించుకోవచ్చని నమ్మపలికారు. దీంతో డాక్టర్ తన భార్యతో కలిసి మదనపల్లికి చేరుకొని నిందితులతో కలిసి బంగారు నగలను పరీక్షించుకున్నారు. రూ.10 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. అనంతరం జనవరి 4వ తేదీన నగలు తీసుకునేందుకు మదనపల్లికి వచ్చారు. నిందితులు ఇచ్చిన నెంబర్:8712186879కు ఫోన్ చేసి వారి సూచన మేరకు, పుంగనూరు రోడ్డులోని కనుములో గంగమ్మ గుడి సమీపంలో ఉన్న నీలగిరి తోట వద్ద కలిశారు. వారి వద్ద నుంచి నగలు తీసుకున్నారు. రూ.7.10 లక్షలు వారికి చెల్లించారు. స్వగ్రామానికి వెళ్లిపోయారు. అక్కడికి వెళ్లిన తర్వాత కొద్ది రోజులకు నగలను పరీక్షించారు. అవి నకిలీవని తేలడంతో గురువారం సాయంత్రం మదనపల్లె తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నకిలీ నగలు అమ్మి బురిడీ కొట్టించిన గుర్తుతెలియని జంట పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ ఎస్ శేఖర్ తెలిపారు.

గుర్రంకొండలో కేవీపల్లె వాసి మృతి

- బస్టాండ్‌లో కుప్పకూలిన వృద్ధుడు
- వలంటీర్ల సాయంతో ఆచూకీ గుర్తింపు
- మృతదేహం తరలింపునకు పోలీసులు ఆర్థిక సాయం


జయరామయ్య మృతదేహం

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో కేవీపల్లె మండలానికి చెందిన వృద్ధుడు మృతి చెందాడు. స్థానిక బస్టాండులో పట్టపగలే ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో పోలీసులు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కేవీపల్లె మండలం తీతవకుంటపల్లె గ్రామానికి చెందిన కె.జయరామయ్య(80) తన కోడలితో కలిసి జీవిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం భార్య, కుమారుడు మృతి చెందారు. దీంతో తన కోడలి వద్ద ఉంటున్నాడు. మతిస్థిమితం సరిగాలేక పోవడంతో మూడు రోజుల క్రితం గుర్రంకొండ బస్టాండుకు వచ్చాడు. బస్టాండ్‌లో సంచరిస్తూ ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు బస్టాండులో జయరామయ్య కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి పరీక్షించడంతో అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిసింది. మొదట్లో గుర్తు తెలియని శవంగా ప్రచారం చేశారు. వలంటీర్ల సాయంతో పలు సామాజిక మాధ్యమాల్లో వృద్ధుడు మృతి చెందిన చిత్రాలను ఉంచారు. చివరకు కేవీపల్లె మండలం తీతవకుంటపల్లె అతని స్వగ్రామం అని గుర్తించారు. మామ మరణవార్త సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొన్న కోడలు సరోజ గుర్రంకొండకు చేరుకొంది. అయితే మృతదేహాన్ని తన సొంత గ్రామానికి తరలించే ఆర్థిక స్థోమత తనకు లేదంటూ దీనంగా రోదించింది. దీంతో స్పందించిన ఏఎస్ఐ నరసింహులుతోపాటు పోలీసులు విరాళాలు సేకరించారు. పీలేరు నుంచి మానవతా సంస్థకు చెందిన వైకుంఠరథాన్ని గుర్రంకొండకు పోలీసులే రప్పించారు. మృతదేహాన్ని అందులో ఎక్కించి, అతని దహన సంస్కారాలకు రూ.4500 ఆర్థిక సాయం అందించి పోలీసులు మానవత్వాన్ని చాటుకొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ఇంటిపై టీడీపీ దాడి

చిన్నమండెం : మండలంలోని కొత్తపల్లి పంచాయతీ శ్రీనివాసపురంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ శ్యామ్ చంద్ర ఇంటిపై గురువారం సాయంత్రం టీడీపీ నాయకులు దాడి చేశారు. బాధితులు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి గురువారం సాయంత్రం శ్రీనివాసపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఇంటి ముందు టీడీపీ కార్యకర్తలు అల్లర్లు చేస్తూ.. పటాసులు కాలుస్తుండగా ఎంపీటీసీ శ్యామ్ చంద్ర భార్య రెడ్డెమ్మ కొంచెం ముందుకు వెళ్లి కాల్చుకోండి అన్నారు. దీంతో టీడీపీ నాయకులు ఆమెను తిట్టి, వారి ఇంటిపైకి రాళ్లు విసిరారు. ఎంపీటీసీ శ్యామ్ చంద్ర పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రమేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఓర్సు వెంకట్రాద్రి, ఓర్సు రెడ్డెప్పతోపాటు మరి కొంత మందిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

మదనపల్లె : మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమవడంపై కేసులు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన మైనర్ బాలిక (16) ఈ నెల 14వ తేదీన ఇంట్లో నుంచి రోడ్డుపైకి వెళ్లి వస్తానని చెప్పి కన్పించకుండా పోయింది. దీంతో బాలిక కోసం గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో కుటుంబ సభ్యులు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. అలాగే మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ కొండమీదపల్లెకు చెందిన యువతి (20) ఈనెల 14వ తేదీ గురువారం పుంగనూరులో షాపింగ్‌కు వెళ్లి తిరిగిరాకపోవడంతో, కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేశారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ శేఖర్ తెలిపారు.

నిమ్మనపల్లె : మైనర్ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని బండ్లపై పంచాయతీ జాండ్ర బైలు గ్రామానికి చెందిన మైనర్ యువతి (17) గురువారం రాత్రి నుంచి కనిపించకుండా పోయిందని, పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, శుక్రవారం కుటుంబ సభ్యులు నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. రామసముద్రం మండలం కాపల్లి పంచాయతీ నల్లచినేపల్లికు చెందిన రెడ్డమ్మ(70) తన కొడుకు వెంకటేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో పొలం వద్దకు వెళుతుండగా అదుపుతప్పి కింద పడింది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అలాగే రామకుప్పం మండలం బందర్లపల్లె పంచాయతీ లింగాపురానికి చెందిన ఎస్‌బీ నితిన్(23) వ్యక్తిగత పనులపై మదనపల్లికి వచ్చాడు. ఆయన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చెట్టుపై నుంచి పడి..

చింత చెట్టు పైనుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మొలకలచెరువు మండలంలో జరిగింది. దేవలచెరువు గ్రామానికి చెందిన సలార్ సాబ్ కుమారుడు మహబూబ్ బాషా (50) కూలీ పనులకు వెళ్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం గ్రామ సమీపంలోని కూలీ పనులలో భాగంగా చింత కాయలు కోసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

మదనపల్లె : భర్త, అతని కుటుంబ సభ్యులపై భార్య ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మదనపల్లి మండలం కొత్తపల్లి పంచాయతీ ఈశ్వరమ్మ కాలనీకి చెందిన షేక్ తస్మియా కౌసర్(26)కు బి.కొత్తకోట పట్టణం పంచాయతీ వీధికి చెందిన హుస్సేన్ భాయ్ అబీద దంపతుల కుమారుడైన షేక్ జాఫర్ సాధిక్‌తో 2019 ఫిబ్రవరి 28న మదనపల్లిలో వివాహం జరిగింది. అప్పుడు రూ.10 లక్షల కట్నం 120 గ్రాముల బంగారు నగలు ఇచ్చారు. ఒక సంవత్సరం వీరి కాపురం సజావుగా సాగింది. వీరికి షేక్ జిలాని(4) కుమారుడు ఉన్నాడు. అనంతరం భర్త షేక్ జాఫర్ సాధిక్ భార్యపై అనుమానంతో నిత్యం వేధించసాగాడు. మరో రూ.10 లక్షలు అదనపు కట్నంగా తేవాలని డిమాండ్ చేస్తూ భర్త, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నట్లు తస్మియా కౌశర్ గురువారం ఫిర్యాదులో పేర్కొంది. షేక్ జాఫర్ సాధిక్, అతని తల్లి ఆబీద, తండ్రి హుస్సేన్ భాయ్, ఆడపడుచు కౌసర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.శేఖర్ తెలిపారు.

సీఏఏ రద్దయ్యే వరకు పోరాటం



సీఏఏ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) రద్దు అయ్యే వరకు పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. సీఏఏ నిబంధనల నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బెంగళూరు బస్టాండ్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసత్వాన్ని మతపరమైన గుర్తింపుతో ముడిపెట్టడం ద్వారా రాజ్యాంగంలో పొందుపరచిన పౌరసత్వం, లౌకిక సూత్రాన్ని సీఏఏ ఉల్లంఘిస్తోందని వివరించారు. పొరుగు దేశాల నుంచి వచ్చే ముస్లింలకు ఈ వివక్షాపూరిత విధానాన్ని అమలు చేసేలా ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా ముస్లిం మూలాలు ఉన్న పౌరుల్ని లక్ష్యంగా చేసుకుంటారనే భయాందోళనలను పెంచుతోందని వివరించారు. సీఏఏని వ్యతిరేకించిన రాష్ట్ర ప్రభుత్వాలను మినహాయించడానికి, రాష్ట్రాలకు పౌరసత్వం కల్పించేందుకు అవకాశం లేకుండా నిబంధనలు రూపొందించబడ్డాయని వివరించారు. సీఏఏను ఆమోదించిన నాలుగేళ్ల తర్వాత, లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్దిరోజుల ముందు ఈ చట్టం నిబంధనల నోటిఫికేషన్ వెలువడటం అంటే, తమ ప్రయోజనాల కోసం సీఏఏ అమలును ఉపయోగించాలని బీజేపీ కోరుకుంటుందని స్పష్టమౌతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని అమలు చేయబోమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌స్పష్టం చేశారని, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఢిల్లీ రాష్ట్రాలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. మత విద్వేషం రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని కుట్రలు పన్నుతున్న బీజేపీతో రాష్ట్రంలో ఉన్న టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. సీఏఏ అమలును, చట్టాన్ని రద్దు చేసే వరకూ సీపీఎం పోరాడుతుందని పేర్కొన్నారు. నిరసనకు మద్దతు తెలిపిన బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు మాట్లాడుతూ భారత రాజ్యాంగ హక్కులను హరించిన సీఏఏను అందరూ వ్యతిరేకించాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.ప్రభాకర్‌రెడ్డి, అంజాద్, నాగరాజు, వెంకటేష్, చాన్ బాష అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా స్ట్రాంగ్ రూములు

జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు


మదనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి/ మదనపల్లె/రామసముద్రం : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలో ఎలాంటి ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి వీలులేకుండా పోలీసులు డేగ కన్నుతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశించారు. శుక్రవారం మదనపల్లె నియోజకవర్గంలో ఎస్పీ, సీఐలు, ఎస్ఐలతో కలిసి ఆయన పర్యటించారు. మదనపల్లె జెడ్పీ హైస్కూల్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లు, పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. అనంతరం రామసముద్రంలో పర్యటించి పోలీస్ స్టేషన్ తనిఖీ అనంతరం సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగడానికి వీలు లేదన్నారు. సమస్యాత్మకమైన ప్రాంతాలను గుర్తించి పోలీసులు నిత్యం నిఘాతో ఉండాలన్నారు. బయట రాష్ట్రాల నుంచి కొత్త వ్యక్తులు వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో గొడవలు జరగకుండా పార్టీల నేతలతో సమీక్షిస్తూ ఉండాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు, అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైలుకు పంపాలన్నారు. ఎస్పీ పర్యటనలో సీఐలు వల్లి బాషా, యువరాజు, కృష్ణమూర్తి, శేఖర్, సద్గురుడు, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, వెంకటేష్, రవికుమార్, లోకేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

శ్రీ భద్రకాళీ సమేతుడికి ఏకాంత సేవ


ఏకాంత సేవ చేస్తున్న ఆలయ అర్చకులు, పాలక మండలి సభ్యులు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి ఏకాంత సేవ చేశారు. శుక్రవారం రాత్రి స్వామికి విశేష పూజలు నిర్వహించిన తరువాత రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి ఊయలలో ఉంచి ఊపుతూ డోలోత్సవం, ఏకాంత సేవ, శయనోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, చంద్రశేఖర్ స్వామి, మల్లికార్జున స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి చేత నిర్వహించారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సులభంగా ధ్రువపత్రాలు



గతంలో ఏవైనా ధ్రువపత్రాలు పొందాలంటే మీసేవాలో దరఖాస్తు చేసుకోవడం తోపాటు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అయినా సకాలంలో అందేవి కావు. పిల్లల చదువులకు చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. అయితే జగనన్న సురక్ష కార్యక్రమం పుణ్యమా అని గ్రామ వలంటీరు సాయంతో దరఖాస్తు చేసుకోగా ఒక్కరోజులోనే ఇంటి వద్దకే ధ్రువపత్రాలు తెచ్చి ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– జి.చెంచమ్మ, బోడుమల్లువారిపల్లె, పీలేరు మండలం, అన్నమయ్య జిల్లా

సొంతింటి కల నెరవేరింది



గతంలో మేము అద్దె ఇంటిలో ఉండేవారం. అద్దె చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. జగనన్న ప్రభుత్వం రావడంతో పేదలకు ఇళ్లు పథకంలో మా కుటుంబానికి ఇంటి స్థలంతోపాటు పక్కా గృహం మంజూరు కావడంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటున్నాం. అర్హతకు పట్టం కట్టేలా జగనన్న ప్రభుత్వం ప్రజలకు లబ్ధి చేకూర్చుతోంది. ఇలాంటి ప్రభుత్వం తిరిగి రావడానికి మేము ఓట్లు వేసి జగనన్నను సీఎం చేసుకుంటాం.

– లక్కీ రంగా(చిన్న), రామాపురం, అన్నమయ్య జిల్లా

మారిన పాఠశాలల రూపురేఖలు



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం నాడు–నేడులో భాగంగా ప్రత్యేక చర్యలు తీసుకుంది. దీంతో పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. జగనన్న ప్రభుత్వం రాక ముందు పేద, మధ్యతరగతి వర్గాల వారు సైతం వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివించుకునేవారు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక నాణ్యమైన భోజనం, దుస్తులు, పుస్తకాలు, విశాలమైన గదులు, ఫర్నీచర్ అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగింది. ప్రభుత్వ ఉపాధ్యాయులంటే సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతున్నాయి. ఇదంతా జగనన్న పాలనలో సాధ్యమైంది.

– ఎస్.మజహరూల్ హక్, స్కూల్ అసిస్టెంట్, నీలకంఠ్రావుపేట, రామాపురం మండలం, అన్నమయ్య జిల్లా.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

– దాదాపు నెల రోజుల తర్వాత పోస్టుమార్టం

మదనపల్లె : ఓ వ్యక్తి పొలం వద్ద కరెంట్ షాక్‌తో మృతి చెందగా, కుటుంబ సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు పూర్తి చేశారు. తిరిగి వారే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాల్సిందిగా తాలూకా పోలీసులను ఆశ్రయించారు. దీంతో దాదాపుగా నెల రోజుల తర్వాత అంత్యక్రియలు పూర్తయిన మృతదేహానికి పోలీసుల సమక్షంలో వైద్యులు స్పాట్ పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి మండలంలోని కోళ్ల బైలు పంచాయతీ మామిడి గుంపులపల్లెకు చెందిన కనుగొన్న వెంకటరమణారెడ్డి (56), ఫిబ్రవరి 17వ తేదీన పొలం వద్ద నీరు పెట్టేందుకు వెళ్లి, ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించకుండా గుట్టు చప్పుడు కాకుండా, అనారోగ్యంతో మృతి చెందాడంటూ.. మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే మృతి చెందిన వెంకటరమణారెడ్డికి సంబంధించిన లావాదేవీలకు మృతికి గల కారణంతో కూడిన ధ్రువపత్రం అవసరం కావడంతో, కుటుంబ సభ్యులు గ్రామంలోని పెద్దల సూచన మేరకు, వెంకటరమణారెడ్డి కుమారుడు కనుగొండ అంకిరెడ్డి... జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా ఎస్పీని కలిసి తన తండ్రి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాల్సిందిగా ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో మదనపల్లి తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం సంఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీసి జిల్లా ఆస్పత్రి వైద్యులచే అక్కడికక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.